## జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

సిటీబ్యూరో, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ )/బండ్లగూడ : జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లోకి వరద కొనసాగుతున్నది. ఎగువ ప్రాంతాల నుంచి జలాశయాల్లోకి వరద నీటి ప్రవాహంతో గేట్లు ఎత్తి దిగువ మూసీలోకి నీటిని వదులుతున్నారు. ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి దిగువ మూసీలోకి 242 క్యూసెక్కులు, హిమాయత్‌సాగర్ జలాశయం ఒక గేటును అడుగ మేర ఎత్తి 348 క్యూసెక్కుల నీటిని మూసీకి వదులుతున్నారు. రెండు జలాశయాల నుంచి 590 క్యూసెక్కుల వరద మూసీలోకి వదిలినట్లు జలమండలి అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## గ్రూప్-1 మెయిన్స్ సజావుగా నిర్వహించాలి



అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్కాడ్స్, రూట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ ఆఫీసర్లు సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్‌శాఖ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందని తెలిపారు. విధులు నిర్వహించే అధికారుల ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

## 18న గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఇన్నోవేషన్ సమ్మిట్

సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు తమ ప్రధాన కార్యాలయాల నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ వినియోగదారులకు సేవలను అందించేందుకు భారతదేశంలో తమ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్ కేంద్రంగా ఐటీ రంగం అభివృద్ధి చెందడంతో పాటు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్‌కి కేంద్రంగా మారింది. నైపుణ్యంతో పాటు చవకగా మానవ వనరులు హైదరాబాద్ కేంద్రంగా పుష్కలంగా ఉన్నాయి. జీసీసీ సెంటర్ల ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలపై మరింత చర్చించేందుకు, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈనెల 18న టీ హబ్‌లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నారు. జీసీసీలలో ఐటీ సేవలతో పాటు ఆర్ అండ్ డీ, ఫైనాన్స్, టెలికాం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ వంటి సేవలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అందించేందుకు నూతన టెక్నాలజీ ఏ విధంగా వినియోగించుకోవాలి, అదేవిధంగా స్థానిక స్టార్టప్‌లకు ఐటీ కంపెనీలతో భాగస్వామ్యంపై ఈ సమ్మిట్‌లో ప్రధానంగా చర్చించనున్నారు.

## కార్పొరేటర్లకు రెండు లక్షల క్రీడా సామగ్రి

సిటీబ్యూరో, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి కార్పొరేటర్‌కు రూ.2 లక్షల విలువ గల క్రీడా సామగ్రిని అందజేయాలని నిర్ణయించారు. క్రీడాభివృద్ధిలో భాగంగా క్రీడా సామగ్రి పంపిణీకి గానూ క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, క్యారం, చెస్, బాస్కెట్ బాల్, వాలీ బాల్, ఫుట్‌బాల్, స్కేటింగ్, టెన్నిస్, టెబుల్ టెన్నిస్ తదితర క్రీడా సామగ్రి అందజేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా ఈ క్రీడా సామగ్రిని అందజేయనున్నారు. ఈ ప్రతిపాదనను గురువారం మేయర్ అధ్యక్షతన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నారు.

# కొత్త సబ్ స్టేషన్లకు భూముల సేకరణ

- నగర శివారు జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసిన విద్యుత్ శాఖ
- వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు సబ్ స్టేషన్లు
- డిసెంబర్ నాటికి ఏర్పాటు లక్ష్యం

సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): వచ్చే వేసవి నాటికి పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా నెట్‌వర్క్‌ను విస్తరించే పనిలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) నిమగ్నమైంది. గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 10 సర్కిళ్ల పరిధిలోనే ప్రతియేటా ఎక్కువ విద్యుత్ వినియోగం నమోదవుతుంది. గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను విస్తృతంగా ఏర్పాటు చేసింది. ఆ కారణంగానే గత వేసవిలో రికార్డు స్థాయిలో డిమాండు పెరిగినా నెట్ వర్క్ తట్టుకొని నిలబడింది. అయినా అక్కడక్కడ అధిక లోడుతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తడంతో పలు సబ్ స్టేషన్లలో పదుల సంఖ్యలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. అదే విధంగా కాలనీలు, ప్రాంతాల వారీగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది వేసవిలో ఉండే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవాలంటే ప్రత్యేకంగా సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని శివారు ప్రాంతాల సర్కిళ్ల అధికారులు డిస్కం ఉన్నతాధికారులకు నివేదించారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోనే కొత్త సబ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తేనే డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా అందించవచ్చని నివేదికలు ఇచ్చారు. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సబ్ స్టేషన్‌లకు అవసరమైన భూముల కోసం ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసింది. అయితే దీనిపై ఇంకా స్పష్టత రాలేదని, భూములు విద్యుత్ శాఖకు అప్పగిస్తేనే సబ్ స్టేషన్ నిర్మాణం పనులు మొదలు పెడతామనే అభిప్రాయాన్ని శివారు ప్రాంత సర్కిళ్ల అధికారులు పేర్కొంటున్నారు.



### కొత్తగా 35-40 సబ్ స్టేషన్లు...

విద్యుత్ ఉత్పత్తి స్టేషన్‌ల నుంచి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ అందుబాటులో ఉన్నా, క్షేత్ర స్థాయిలో సరఫరా చేసే నెట్ వర్క్‌ను యుద్ధ ప్రాతిపదికన విస్తరించాల్సిన అవసరం ఉంది. దక్షిణ డిస్కం అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కోసం సుమారు రూ.450 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా సుమారు 35-40 సబ్ స్టేషన్‌లను కొత్తగా నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.5 నుంచి రూ.8 కోట్ల ఖర్చువుతుందని ప్రాథమికంగా అంచనాలు సిద్ధం చేశారు. అయితే సబ్ స్టేషన్‌లకు అవసరమైన భూములు మాత్రం అందుబాటులో లేవు. ఆయా జిల్లాల కలెక్టర్‌లు ప్రభుత్వ భూములను కేటాయిస్తేనే పనులు మొదలు పెట్టేందుకు అవకాశం ఉంది. సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్లలోనే కొత్త సబ్ స్టేషన్‌లను నిర్మాణం చేయాల్సి ఉందని, ఇక్కడ ఇప్పటివరకు సబ్ స్టేషన్‌కు అవసరమైన భూములను కేటాయించకపోవడంతో పనులు చేపట్టలేకపోతున్నామని సర్కిల్ అధికారులు పేర్కొంటున్నారు. డిసెంబర్ నాటికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా, భూములను రెవెన్యూ అధికారులు అప్పగించకపోవడంతో సబ్ స్టేషన్‌ల నిర్మాణం జాప్యం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

## బాలుర సదనాలు శిక్షణాలయాలు



జువైనల్ అబ్జర్వేషన్ హోం ఆవరణలో చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సైదాబాద్, అక్టోబర్ 15 : బాలుర సదనాల్లోని చిన్నారులు ఈ సమయాన్ని శిక్ష కాలంగా కాకుండా, శిక్షణ కాలంగా తీసుకొని సత్ప్రవర్తనతో మీ కుటుంబాలకు దరిచేరాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని చిల్డ్రన్ హోం (జువైనల్ హోం) ఫర్ బాయ్స్, అబ్జర్వేషన్ హోంలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాలుర అబ్జర్వేషన్ హోం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ చిన్నారులు తెలిసి, తెయక చేసిన నేరాలతో ఇక్కడ ఉంటున్న వారందరి, ఉజ్వల భవిష్యతును దృష్టిలో పెట్టుకొని ప్రయోజకులు తీర్చిదిద్దటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బాలుర సదనాల్లో ఉంటున్న వారిలో పరివర్తన మార్పు తీసుకొని రావాలని, మంచి శిక్షణ ఇప్పించి, నైపుణ్యం వెలికి తీయాలన్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారులకు అనాథ అనే అభిప్రాయం కలుగకుండా ప్రభుత్వమే తల్లింద్రులు అనే భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణ, తెలంగాణ జువైనల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ డిపార్టుమెంట్ డైరెక్టర్ కాంతి వెస్లీ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా రజా అలీబేగ్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణీ, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి, బాలుర సదనాల పర్యావేక్షణాధికారులు సంగమేశ్వర్, అఫ్జల్ షా, బాలికల సదనం పర్యావేక్షణాధికారిణి మైథిలీ, డెరెక్టరేట్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, అధికారులు చార్వక్, ఆఫీస్ సూపరింటెండెంట్ గోపికుమార్, ఉమర్ పాల్గొన్నారు.

## పుల్లినం ఏరోస్పేస్‌తో ఒప్పందం



ఒప్పందపత్రాలను చూపుతున్న ఇరువర్గాల ప్రతినిధులు

దుండిగల్, అక్టోబర్ 15: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలకు చెందిన ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగం, చెన్నైకి చెందిన పుల్లినం ఏరోస్పేస్ అనే సంస్థతో పరస్పర అవగాహన ఒప్పంద కుదుర్చుకుంది. ఈ మేరకు కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి,సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి,ప్రిన్సిపాల్ డా,శ్రీనివాసరావు, ఏరోనాటికల్ విభాగాధిపతి డా,ఎం.సత్యనారాయణ గుప్త, పుల్లినం ఏరోస్పేస్ ఫౌండర్ కరుణాకరన్,కో-ఫౌండర్ శ్యామ్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయంగా పెరుగుతున్న విమానాల రవాణాలకు సంబంధించి ఈ ఒప్పందం ద్వారా పది సీట్ల విమానాలను తయారుచేసి పులినం ఏరోస్పేస్ సంస్థకు అప్పగించే బాధ్యతను ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఏరోనాటికల్ విభాగం తీసుకోనుందన్నారు. మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ పుల్లినం ఏరోస్పేస్‌తో తమ కళాశాల ఒప్పందం చేసుకోవడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే,కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తమ కళాశాలలో విద్యార్థులను ఎల్లవేళలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందాన్ని కుదిర్చిన ఏరోనాటికల్ విభాగాధిపతి డా,ఎం.సత్యనారాయణ గుప్తా,అధ్యాపకులను ఆయన అభినందించారు. అనంతరం ఏరోనాటికల్ విభాగం ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డా,ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కళాశాల మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రెడ్డి,ఏరోనాటికల్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## 20న ప్రజా సంబురాలు

సిటీబ్యూరో, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రజా సంబురాలు పేరిట అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. కేబీఆర్ ప్రొమెనేడ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు ప్రజా సంబురాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. హైదరాబాద్ సాంప్రదాయ, వారసత్వ సంపద సంరక్షణ, మరుగున పడిపోతున్న కళలకు పునర్జీవం పోయడం, ప్రాంతీయ కళాకారులు, ఔత్సాహికులకు ప్రోత్సహించడం ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రజా సంబురాలకు ఉచిత ప్రవేశం ఉందని, ఆర్ట్స్, పెయింటింగ్ పోటీలలో పాల్గొనేవారు మాత్రం తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. చిత్రకళ పోటీలకు సంబంధించి థీమ్ స్పాట్‌లో ఇవ్వనున్నట్లు, చార్ట్ పేపర్, బోర్డు స్కెచ్‌లు ఏర్పాటు చేస్తారని ఈ పోటీ ఉచితమని, ఎలాంటి రుసుం లేదని పేర్కొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతి, సర్టిఫికెట్ అందజేస్తారని, వివరాలకు ఖైరతాబాద్ జోనల్, జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

# రేవంత్.. చేతగాకుంటే దిగిపో

- 48 గంటల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుంటే యుద్ధమే
- 22న కలెక్టరేట్ల ముట్టడి జయప్రదం చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, తదితరులు

రవీంద్రభారతి,అక్టోబర్ 15: రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల రూ. 4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 48 గంటల్లోపు చెల్లించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రైవేట్ కాలేజీల నిరవధిక బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆయన మాట్లాడారు. ఫీజుల కోసం తెలంగాణ ప్రైవేట్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు 1000 డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయని, ఇది తొలిసారి అని, ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యలో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకు జీతాలు తీసుకోవడం లేదా అని, విద్యార్థుల చదువులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 22న విద్యార్థి సంఘాలు ఇచ్చిన కలెక్టరేట్ల ముట్టడి జయప్రదం చేయాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఫీజు బకాయిలు ఇచ్చే వరకు బందులు, నిరసనలు, ధర్నాలు కొనసాగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి బేషజాలకు పోకుండా బకాయిలు విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ విద్యార్థులకు అన్ని విధాలు చేయూతనిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఇప్పుడు ఎక్కడికి పోయిండని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు కూడా చేయడంలేదన్నారు. చచ్చిపోయిన కాంగ్రెస్ పార్టీని చూసి ఎవరూ ఓటువేయలేదని, విద్యార్థులు, నిరుద్యోగులు కలసి కాంగ్రెస్‌కు ఓటువేశారని ఇది గుర్తుంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగించాలని సూచించారు. నీకు పరిపాలించ చేతకాకుంటే మరొకరికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే ఫీజు బకాయిలు చెల్లించాలని , లేకుంటే నిరవధిక ధర్నాలు, బందులు, రాస్తారోకోలతో ఈ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, అధ్యక్షత వహించగా, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్‌నేతలు, జెల్లపల్లి అంజి, పరమేశ్వర్, రామకృష్ణ, సుభాశ్ రెడ్డి, నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

## డీఎస్సీ నియామక పత్రాలు అందజేత

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 15: డీఎస్సీ 2024 ఉపాధ్యాయుల నియామకాల కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగి ంది. మంగళవారం అబిడ్స్ లోని స్టాన్లీ గర్ల్స్ హై స్కూల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభం కావల్సిన కౌన్సెలింగ్ 317 అభ్యర్థులు కోర్టులో కేసు వేశారనే సమాచారంతో మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్‌లో మొత్తంగా 584 మంది పాల్గొనగా అందులో ఎస్ఏలు 107 మంది అభ్యర్థులకు, ఎల్‌పీలు 91 మంది అభ్యర్థులకు, ఎస్‌జీటీలు 386 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి డీఈవో రోహిణి నియామక పత్రాలను అందజేశారు.

## వాణిజ్య భవనాలకు సిల్ట్‌చాంబర్స్ తప్పనిసరి

సిటీబ్యూరో, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ ) : సీవరేజీ ఓవర్‌ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణాలపై జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఎల్బీనగర్, నాగోల్ ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించారు. పూడికతీత, మ్యాన్‌హోళ్ల పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఓల్డ్ నాగోల్ విలేజ్‌లో జీహెచ్ఎంసీ గతంలో సీవరేజీ లైన్లను నిర్మించి రెయిన్ వాటర్ డ్రైన్‌కు అనుసంధానం చేశారని, ఆ ప్రాంతంలో జలమండలి సీవరేజీ నిర్వహణ చేపట్టింది. జీహెచ్ఎంసీ వర్షాకాలంలో రెయిన్ వాటర్ డ్రైన్‌కు డీ సిల్టింగ్ పనులు చేపట్టకపోవడంతో మురుగు పొంగి రోడ్లపైకి వస్తుందని, ఈ సమస్య పరిష్కారానికి కొత్తగా సీవరేజీ పైపులైన్ నిర్మించి మూసీలో ఉన్న సీవరేజీ ట్రంక్ మెయిన్‌కి అనుసంధానించాలని ఎండీ అధికారులకు సూచించారు. అనంతరం ఎల్బీనగర్‌లోని వాస్తు కాలనీ, హోటల్ స్వాగత్ గ్రాండ్ పరిసర ప్రాంతాలకు ఎండీ వెళ్లారు. 15 కాలనీల్లో సీవరేజీ ఔట్‌లెట్ లేక మురుగు సమస్యలు తలెత్తుతున్నాయని, ఇక్కడా మురుగు సమస్య పరిష్కారానికి ఔట్‌లెట్ నిర్మించాలని సూచించారు. పలు హాస్పిటల్స్, హాస్టల్స్ లాంటి వాణిజ్య భవనాలు సిల్ట్‌చాంబర్స్ నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఎండీ సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ స్వామి, సీజీఎం నాగేందర్, జీఎంలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 15 : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలతో కలసి ఆయన మంగళవారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలలో రూ.79.50 కోట్లతో నిర్మించనున్న నూతన హాస్టల్ భవనాలకు శంకుస్థాపన చేశారు. ముందుగా ఇటీవల ఐవీఎఫ్ సేవలు ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, డీఎంఈ డాక్టర్ వాణి, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాల్యా, డాక్టర్ రవిశేఖర్ రావు, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్.ఎన్.రాజకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ సుబోధ్ కుమార్, డాక్టర్ సునీల్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, పలు విభాగాల హెచ్ఓడీలు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## జన్యుసంబంధిత పరిశోధనను ప్రోత్సహించాలి




సజ్జాఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె. నందికూరి, ప్రొ.ప్రభాకరన్ దొరైరాజ్, డాక్టర్ లోకేశ్వర్ రావు

సిటీబ్యూరో, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): మల్టీడ్రగ్ రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్‌ల వంటి సవాళ్ల నేపథ్యంలో జన్యు సంబంధిత పరిశోధనను ప్రోత్సహించాలని సీసీఎంబీ హైదరాబాద్ డైరెక్టర్ డా.వినయ్ నందికూరి సూచించారు. మంగళవారం సజ్జా హార్ట్ ఫౌండేషన్ పదో వార్షిక సమావేశం బేగంపేట గ్రీన్ పార్క్ హోటల్‌లో నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డా.లోకేశ్వర్ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా ప్రముఖ కార్డియాక్ సర్జన్లు, కార్డియాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.వినయ్ మాట్లాడుతూ భారతదేశంలో పరిశోధన సంస్థల వృద్ధి అవసరాన్ని ప్రస్తావిస్తూ శాస్త్రీయ పరిశోధనను అభివృద్ధి చేయడానికి ప్రబలమైన వ్యాధులకు పరిష్కారాలు కనుగొనడానికి పరిశోధనలు చేసేదిశగా వైద్య సమాజాన్ని ప్రోత్సహించాలని సూచించారు. స్టార్ హాస్పిటల్స్ కార్డియోథొరాసిక్‌సర్జరీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం మాట్లాడుతూ కార్డియాక్ సర్జరీ రంగానికి సజ్జాఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందిస్తూ, పరిశోధన ఆవిష్కరణలకు ఫౌండేషన్ యొక్క నిబద్ధత గొప్పదన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రభాకరన్ దొరైరాజ్ భారతీయులకు హృదయ సంబంధిత వ్యాధులకు ఎక్కువ ప్రవృత్తి ఎందుకు ఉంది అనే అంశంపై మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జన్యు పర్యావరణ కారకాలు హృదయసంబంధిత వ్యాధులకు ముఖ్యమైన కారకాలుగా పేర్కొన్నారు. పెరుగుతున్న హృదయ సంబంధ వ్యాధులను నివారించడంలో వ్యక్తిగత బాధ్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ లోకేశ్వర్‌రావు మాట్లాడుతూ రీసెర్చ్ అండ్ స్టడీ ద్వారా హృదయసంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికోసం మనుగడ మెరుగుపరచాలన్న ఫౌండేషన్ లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ ఆదిత్యకొప్పుల ఫౌండేషన్ విజన్ స్టేట్‌మెంట్‌ను సమర్పించారు.



అడ్డగూడూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏడీఏ పద్మావతి

## శనగ పంట సాగుపై అవగాహన

అడ్డగూడూరు, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం శనగ పంట సాగు మెళకువలపై ఏడీఏ పద్మావతి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పుడూ ఒకే రకమైన పంటలు వేయకూడదని, పంట మార్పిడి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ పాండురంగాచారి, ఏఈఓలు దయాకర్, నవనీత, రైతులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

భువనగిరి అర్బన్, అక్టోబర్ 15 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు వెంటనే అద్దె చెల్లించాలని, ఇంటిగ్రేడెడ్ గురుకులాల పేరుతో ఉన్న గురుకులాలను విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

## నేటి నుంచి గ్రామీణ మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ

బీబీనగర్, అక్టోబర్ 15 : గ్రామీణ మంచినీటి సరఫరా సహాయకులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ వై.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16నుంచి 19వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నీటి వినియోగం, సరఫరా విధానం, వాటర్ ట్యాంకుల శుభ్రతతోపాటు పలు అంశాలపై శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## 'ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు వివరాలు తెలుపాలి'

భువనగిరి అర్బన్, అక్టోబర్ 15 : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, కేసుల నమోదు వివరాలను తెలుపాలని డీసీపీ కార్యాలయంలో పెరుమండ్ల రామకృష్ణ మంగళవారం ఆర్టీఏ కింద కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం ఆదేశాల మేరకు డీసీపీ కార్యాలయంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలను తెలుపాలని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్, నాయకులు కొండపురం గణేశ్, భాస్కర్, భిక్షపతి, నరేశ్ పాల్గొన్నారు.

## 'పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది సభను జయప్రదం చేయండి'




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 15 : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 24న నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) పట్టణ కార్యదర్శి పగడాల శివ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ, పీవైఎల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ 50 ఏండ్లుగా విద్యార్థుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తూ విద్యార్థి ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషిస్తుందన్నారు. బహిరంగ సభకు విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, కార్తీక్, కిరణ్, మధు, ప్రసన్న, రాకేశ్, పల్లవి, నందిని, వర్షిత, శరత్‌చంద్ర, సురేశ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

మోత్కూరు, అక్టోబర్ 15 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోత్కూరు ఎస్ఐ డి.నాగరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపలో మంగళవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నర్సింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరు పేదలకు చేయూత అందిస్తా

ఆలేరు టౌన్, అక్టోబర్ 15 : నిరు పేదలకు చేయూత అందించి ఆదుకుంటామని ఆలేరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళామురహరి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జంగాల కాలనీకి చెందిన మోతె లింగయ్య మృతిచెందగా.. మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు.